సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం । 25 । జూలై । 2025



రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపిక
కిన్నెరసాని క్రీడా పాఠశాలలో జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించగా వివిధ ప్రాంతాల నుంచి 600 మంది హాజరయ్యారు. 8లో



శ్రావణం.. ఆధ్యాత్మికం
సకల శుభాలకు నిలయంగా భావించే శ్రావణ మాసం శుక్రవారం ప్రారంభం కానుండగా పెళ్లిళ్లు, శుభకార్యాలు జరుగుతాయి. 8లో

గరిష్టం / కనిష్టం
27° / 24°

వాతావరణం
జిల్లాలో శుక్రవారం అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతమై పలు చోట్ల ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సుమనోహరంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం సుమనోహరంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కాగా, రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితారాణా గురువారం శ్రీ సీతారామచంద్రస్వామి వారిని దర్శించుకున్నారు.

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



అమ్మవారికి సువర్ణ పుష్పార్చన చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి గురువారం 108 సువర్ణ పుష్పాలతో వైభవంగా అర్చన నిర్వహించారు. ఆ తర్వాత నివేదన, హారతి సమర్పించి మంత్రపుష్పం పఠించారు. కార్యక్రమంలో వేద పండితులు పద్మనాభ శర్మ, అర్చకులు రవికుమార్ శర్మ, ఈఓ ఎన్.రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు 'దిశ' సర్వసభ్య సమావేశం

చుంచుపల్లి: జిల్లా అభివృద్ధి, సమన్వయ(దిశ) సర్వసభ్య సమావేశం శనివారం మధ్యాహ్నం 3 గంటలకు ఐడీఓసీలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ జితేష్ వి.పాటిల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి కో – చైర్మన్, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్ తో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరవుతారని వివరించారు. అన్ని శాఖల అధికారులు తమ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనుల నివేదికలతో సకాలంలో రావాలని సూచించారు.

కిన్నెరసాని నుంచి నీటి విడుదల

పాల్వంచరూరల్ : జిల్లాతో పాటు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో కిన్నెరసాని జలాశయంలోకి భారీగా వరద చేరుతోంది. దీంతో ఒక గేటు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. రిజర్వాయర్ సామర్థ్యం 407 అడుగులు కాగా, ఎగువ నుంచి గురువారం 4,800 క్యూసెక్కుల వరద నీరు రావడంతో నీటి మట్టం 404.30 అడుగులకు పెరిగింది.దీంతో ప్రాజెక్టు అధికారులు రాత్రి ఒక గేటు ఎత్తి 1000 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేశారు. పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

పౌరసేవల్లో మీ సేవ కేంద్రాలే కీలకం



మీ సేవ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్

బూర్గంపాడు: పౌరసేవలు వేగవంతం చేయటంలో మీ సేవ కేంద్రాలే కీలకమని జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ అన్నారు. మోరంపల్లి బంజరలోని మీ సేవ కేంద్రాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరు, దరఖాస్తుల పరిష్కారం, సమయపాలన తదితర అంశాలను పరిశీలించారు. ఇటీవల ప్రభుత్వం మీ సేవ కేంద్రాల్లో కొత్తగా అమలు చేస్తున్న పౌరసేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వినియోగదారుల నుంచి ప్రభుత్వం నిర్దేశించిన ఫీజులే తీసుకోవాలన్నారు. మీ సేవ కేంద్రాల డిస్ట్రిక్ట్ మేనేజర్ సైదేశ్వరరావు పాల్గొన్నారు.

హ్యామ్‌తో మహర్దశ



డబుల్ రోడ్డుగా విస్తరించనున్న కొత్తగూడెం - ఆళ్లపల్లి రహదారి

జిల్లాలో పది రోడ్ల అభివృద్ధి, విస్తరణ
- మొత్తంగా 266 కి.మీ. రహదారులకు మోక్షం
- నిర్మాణ వ్యయం అంచనా రూ.380 కోట్లు
- దశ మారనున్న ఆళ్లపల్లి – కొత్తగూడెం రోడ్డు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రానికి, జిల్లా కేంద్రాల నుంచి రాష్ట్ర రాజధానికి వెళ్లే రోడ్లను హ్యామ్ (హైబ్రిడ్ యాన్యూటీ మోడల్) విధానంలో విస్తరణ, అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు జిల్లాల వారీగా అభివృద్ధి చేయబోయే రోడ్ల వివరాలను రహదారులు, భవనాల శాఖ వెల్లడించింది. రాష్ట్ర వ్యాప్తంగా 373 రోడ్లను హ్యామ్‌లో అభివృద్ధి చేయనుండగా.. జిల్లాకు చెందిన పది రోడ్లకు అవకాశం దక్కినట్లుగా ప్రకటించారు. ఈ పదింటిలో మొత్తం 266 కి.మీ నిడివి కలిగిన పలు రోడ్ల అభివృద్ధికి అవకాశం ఏర్పడింది. ఇందుకోసం రూ.380 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఇందులో 40 శాతం వ్యయం రాష్ట్ర ప్రభుత్వం, 60 శాతం నిర్మాణ పనులు దక్కించుకున్న సంస్థ భరించనున్నాయి.

పేరుకే పది.. చేసేది ఐదే..
హ్యామ్ విధానంలో అభివృద్ధి చేసే వాటిలో ప్రధానంగా కొత్తగూడెం – తల్లాడ, అనిశెట్టిపల్లి – ఆళ్లపల్లి, దమ్మపేట – పాల్వంచ, బూర్గంపాడు – దుగినేపల్లి (ఏటూరునాగారంరోడ్డు), పాల్వంచ (ఏపీ స్టీల్స్) – పినపాక పట్టీనగర్ రోడ్లు ఉన్నాయి. ఈ పథకం కింద జిల్లాలో పది రోడ్లను అభివృద్ధి చేయబోతున్నట్టు అధికారులు ప్రకటించినా.. క్షేత్రస్థాయిలో అవి ఐదు రోడ్లుగానే ఉన్నాయి. ప్రతీ పనిని నియోజకవర్గాల వారీగా విభజించడంతో ఈ ఐదు రోడ్లనే పది రహదారులుగా చూపిస్తున్నారు. అభివృద్ధి చేయబోయే రోడ్లలో అత్యధికంగా పినపాక నియోజకవర్గం పరిధిలో 75.20 కి.మీ. నిడివి ఉండగా అత్యల్పంగా ఇల్లెందు నియోజకవర్గం పరిధిలో 25 కి.మీ. నిడివి ఉంది. భద్రాచలం నియోజకవర్గానికి హ్యామ్ స్కీమ్‌లో అసలు చోటే దక్కలేదు.

రోడ్డు	నిడివి(కి.మీ.)	లబ్ధిపొందే నియోజకవర్గాలు
కొత్తగూడెం – తల్లాడ	36	కొత్తగూడెం, వైరా, సత్తుపల్లి
దమ్మపేట – పాల్వంచ	59	కొత్తగూడెం, అశ్వారావుపేట
బూర్గంపాడు – ఏ.నాగారం	58.20	పినపాక
పాల్వంచ – పి.పట్టీనగర్	10	కొత్తగూడెం, పినపాక
అనిశెట్టిపల్లి – ఆళ్లపల్లి	25	ఇల్లెందు, పినపాక

ప్రజలపై భారం పడకుండా
ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) పద్ధతిలో గతంలో కొన్ని రోడ్ల నిర్మాణం జరిగేది. అభివృద్ధి పనులను ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు చేపడతాయి. ఆ తర్వాత నిర్మాణ వ్యయాన్ని వినియోగదారుల(ప్రజలు) నుంచి నిర్ణీత కాలానికి టోల్‌గేట్లు, ఇతర పద్ధతుల ద్వారా వసూలు చేసుకుంటాయి. వ్యయానికి సరిపడా రాబడి వచ్చిన తర్వాత సదరు ఆస్తులను ప్రభుత్వానికి అప్పగిస్తాయి. వినియోగదారులపై ఆర్థిక భారం పడుతుండడంతో ఈ విధానంపై విమర్శలు వస్తుండగా.. ఈ భారాన్ని తగ్గిస్తూ కొత్తగా హైబ్రిడ్ యాన్యూటీ మోడల్ (హ్యామ్) పద్ధతిని అమల్లోకి తీసుకొచ్చారు. ఇందులో నిర్మాణ వ్యయంలో ప్రభుత్వం 40 శాతం భరిస్తే మిగిలిన 60 శాతాన్ని నిర్మాణ సంస్థ (కాంట్రాక్టర్) భరిస్తారు. అయితే ప్రైవేటు సంస్థ భరించిన వ్యయాన్ని పదిహేనేళ్లలో విడతల వారీగా ప్రభుత్వమే చెల్లిస్తుంది. దీని వల్ల వినియోగదారులపై ఆర్థిక భారం పడదు. సులభ వాయిదాల్లో నిర్మాణ వ్యయాన్ని చెల్లించే వీలు ప్రభుత్వానికి ఉంటుంది.

ఏజెన్సీ రోడ్లకు స్థానం..
హ్యామ్ పథకం కింద ఎంపిక చేసిన రోడ్లలో కొత్తగూడెం-తల్లాడ, బూర్గంపాడు-ఏటూరునాగారం, దమ్మపేట-పాల్వంచ రోడ్లను జాతీయ రహదారులుగా మార్చాలంటూ కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే విజ్ఞప్తి చేసింది. ఈ రోడ్లు హ్యామ్ పథకంలో కాకపోయినా రేపో మాపో నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా(నాయ్) ద్వారా అయినా అభివృద్ధి చేసే అవకాశం ఉంది. కానీ, హ్యామ్‌లో కొత్తగా చేర్చిన ఆళ్లపల్లి-అనిశెట్టిపల్లి (వయా తిర్లాపురం, అనంతోగు, సిద్దారం, గంగారం), పాల్వంచ-పినపాక పట్టీనగర్ క్రాస్ రోడ్ (వయా సీతారాంపట్నం, కేటీపీఎస్, పాండురంగాపురం, ఉప్పుసాక) రోడ్లు పూర్తిగా ఏజెన్సీ ఏరియాల్లో ఉన్నాయి. ఈ రహదారుల విస్తరణ జరిగితే ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుంది.

వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ జితేష్ వి పాటిల్



పాల్వంచ : అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. భారీ ప్రవాహ సమయంలో నదులు, కాల్వలు, చెరువుల వద్దకు వెళ్లొద్దని, దాటేందుకు ప్రయత్నించొద్దని సూచించారు. తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. రైతులకు అవసరమైన సూచనలు చేయాలని వ్యవసాయాధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరా నిలిచినా ఆస్పత్రుల్లో అత్యవసర సేవలకు అంతరాయం వాటిల్లకుండా వైద్య శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. నెలలు నిండిన గర్భిణులను ముందుగానే ఆస్పత్రులకు చేర్చాలని తెలిపారు.

ఆన్‌లైన్ తరగతులు వినియోగించుకోవాలి
పాల్వంచ: రాష్ట్ర ప్రభుత్వం, ఖాన్ అకాడమీ సంయుక్త నిర్వహణలో కేజీబీవీ విద్యార్థులకు 6 నుంచి 12వ తరగతి వరకు భౌతిక, రసాయన శాస్త్రాలు, గణిత సబ్జెక్టుల్లో ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తున్నాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పాటిల్ సూచించారు. పాల్వంచ కేజీబీవీని గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పిల్లలకు అవసరమైన పుస్తకాలు, కంప్యూటర్లు తెప్పించుకోవాలని, వాటి జాబితా తనకు అందిస్తే అవసరమైన కంప్యూటర్లు పంపిస్తామని హామీ ఇచ్చారు. పాఠశాలకు అవసరమైన వసతుల విషయంలో రాజీపడకుండా అన్ని వస్తువులు సమకూర్చాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలని డీఈఓ వెంకటేశ్వరాచారిని ఆదేశించారు. మోడల్ కేజీబీవీగా అభివృద్ధి చేసి రాష్ట్రంలో ఉన్నత స్థానంలో ఉంచేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి ఎ.నాగరాజశేఖర్, సీఎంఓ ఎస్‌కే.సైదులు, బాలికా విద్య కోఆర్డినేటర్ జె.అన్నామణి, తహసీల్దార్ దారా ప్రసాద్, కేజీబీవీ ప్రత్యేకాధికారి తులసీ విద్యాసాక్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా భద్రగిరి ప్రదక్షిణ



రామయ్య చిత్రపటంతో గిరిప్రదక్షిణ నిర్వహిస్తున్న భక్తులు

భద్రాచలంటౌన్ : శ్రీరాముడి జన్మనక్షత్రం పునర్వసును పురస్కరించుకుని భక్త రామదాసు ట్రస్ట్ నిర్వాహకుడు కంచర్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువారం వైభవంగా గిరి ప్రదక్షిణ చేశారు. రామయ్య కరుణాకటాక్షాలతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుతూ ఈ వేడుక నిర్వహించినట్లు శ్రీనివాసరావు తెలిపారు. గిరి ప్రదక్షిణ చేసిన భక్తులకు ప్రత్యేక దర్శనంతో పాటు స్వామివారి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో వేదపండితులు గుదిమెళ్ల మురళీకృష్ణమాచార్యులు, ఆలయ ఏఈఓ శ్రవణ్‌కుమార్, సీసీ శ్రీనివాస రెడ్డి, పీఆర్‌ఓ సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

పిల్లల భవిష్యత్ మార్చేది ఉపాధ్యాయులే..

- సెప్టెంబర్ నుంచి ఎస్సెస్సీ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- ఎఫ్ఆర్ఎస్ ద్వారా ఉపాధ్యాయుల హాజరు నమోదు
- విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా




మాట్లాడుతున్న రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా, పక్కన అధికారులు

ఖమ్మం సహకారనగర్: పిల్లల భవిష్యత్‌ను ఉజ్వలంగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉంటుందని రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితారాణా తెలిపారు. ఈ విషయాన్ని గుర్తించి తరగతి గదిలో విద్యార్థులతో మమేకమవుతూ పాఠాలు బోధించాలని సూచించారు. ఖమ్మం కలెక్టరేట్‌లో గురువారం ఆమె విద్యాశాఖ సంచాలకులు డాక్టర్ ఈ.నవీన్ నికోలస్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజలతో కలిసి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా యోగితారాణా మాట్లాడుతూ రెండు రోజులుగా ఉమ్మడి జిల్లాలోని పలు పాఠశాలలను తనిఖీ చేశామని తెలిపారు. సింగరేణి మండలం కారేపల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ చొరవతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని నమ్మకం కలిగిందన్నారు. అలాగే, ఖమ్మం ఎన్నెస్పీ క్యాంప్ ప్రాథమిక పాఠశాలలో ఈ ఏడాది 140 మంది విద్యార్థులు కొత్తగా చేరడం ఆనందంగా ఉందని తెలిపారు. పాఠశాలలకు వచ్చే పిల్లలకు నేర్పించేదే వారి జీవితంలో కీలకంగా మారుతుందని చెప్పారు. ఆ దిశగా ఉపాధ్యాయులు కృషి చేస్తూ విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టాలని సూచించారు. డీఈఓలు, ఎంఈఓలు తరచూ పాఠశాలలను తనిఖీ చేస్తూ ఉపాధ్యాయులకు సూచనలు చేయాలని, ఐఏ ల్యాబ్‌ల నిర్వహణపై దృష్టి సారించాలని తెలిపారు. ఇదే సమయాన పాఠశాలల్లో ఉపాధ్యాయులు సకాలంలో హాజరయ్యేలా పర్యవేక్షిస్తూ వారి హాజరును ఫేస్ రికగ్నేషన్ సిస్టం(ఎఫ్ఆర్ఎస్) ద్వారా నమోదు చేయాలని సూచించారు. అలాగే, జీరో ఎన్‌రోల్‌మెంట్ పాఠశాలల సమీపాన అంగన్‌వాడీ కేంద్రాల నుంచి పిల్లలను చేర్పించాలని సూచించిన ఆమె... పదో తరగతిలో మెరుగైన ఫలితాల సాధనకు సెప్టెంబర్ నుంచి ప్రత్యేక తరగతులు ప్రారంభించి స్నాక్స్ సమకూర్చాలని తెలిపారు. కాగా, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేకంగా ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేసి విద్యార్థులందరికీ కార్డులు జారీ చేయించాలని సూచించారు. అనంతరం విద్యా శాఖ సంచాలకులు డాక్టర్ ఈ.నవీన్ నికోలస్, ఖమ్మం జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ మాట్లాడగా ఎస్సెస్సీలో అత్యధిక ఉత్తీర్ణత శాతం సాధించిన, మూతబడిన స్కూళ్లు తెరిపించిన, అత్యధికంగా విద్యార్థులను చేర్పించిన మండలాల ఎంఈఓలను సన్మానించారు. ఈ సమీక్షలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ట్రెయినీ కలెక్టర్ సౌరభ శర్మ, విద్యాశాఖ రాష్ట్రస్థాయి అధికారులు రమణకుమార్, రాజీవ్, సత్యనారాయణరెడ్డి, మదన్‌మోహన్, వెంకటనర్సమ్మ, డాక్టర్ హెచ్.హరీష్, మంజరి, డీఈఓ సత్యనారాయణ, నాలుగు జిల్లాల అధికారులతో పాటు జి.సురేష్, ప్రాంజలి పాఠక్, తదితరులు పాల్గొన్నారు.

క్షీరమే జాలువారినట్టుగా..

కనువిందు చేస్తున్న జలపాతం



చుట్టూ అడవి.. పక్షుల కిలకిలారావాల నడుమ క్షీరమే జాలువారుతోందా అన్నట్టుగా.. తెల్లని నురుగుతో నీరు వస్తున్న ఈ జలపాతం పర్యాటకులను ఆకట్టుకుంటోంది. మణుగూరు సమీపంలోని కట్టుమల్లారం వద్ద గల కొండపై ఉన్న ఈ జలపాతాన్ని చూసేందుకు పట్టణ ప్రజలు, ఇతర ప్రాంతాల పర్యాటకులు తరలివస్తున్నారు. ఆదివారం, సెలవు రోజుల్లో అయితే భారీగా వస్తుంటారు. అయితే ఈ ప్రాంతానికి రహదారి సౌకర్యం కల్పించడంతో పాటు టూరిస్ట్ స్పాట్‌గా గుర్తించి ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని పలువురు కోరుతున్నారు. – మణుగూరు టౌన్

గూడు లేక గోడు



ఆర్‌అండ్‌బీ స్థలంలో జరుగుతున్న రాళ్ల తొలగింపు పనులు

- భద్రాచలంలో ఇంటి కోసం నిర్వాసితుల ఎదురుచూపులు
- ఆర్‌అండ్‌బీ స్థలంలో కొనసాగుతున్న పనులు
- మరో నెలకు పైగా సమయం పట్టే అవకాశం
- ప్యాకేజీ, స్థలం త్వరగా ఇవ్వాలంటున్న బాధితులు

భద్రాచలం: ఎన్నో ఏళ్లుగా ఉంటున్న గూడు చెదిరింది. రామాలయం అభివృద్ధి చెందితే అందరి బతుకులూ బాగుపడతాయని సరిపెట్టుకున్నారు. మాడ వీధుల విస్తరణ కోసం ఇళ్లు ఖాళీ చేయాలని, ప్రత్యామ్నాయ స్థలం చూపిస్తామని, ఇంటి నిర్మాణానికి ప్యాకేజీ కూడా ఇస్తామని అధికారులు చెప్పిన మాటలు నమ్మారు. ఆ వెంటనే పెట్టే బేడా సర్దుకొని కట్టుబట్టలతో ఇళ్లు, దుకాణాలు ఖాళీ చేశారు. కానీ అధికారుల హామీలు ఇంకా కార్యరూపం దాల్చకపోవడంతో అటు వ్యాపారాలు కోల్పోయి, ఇటు ఇంటి అద్దెలు చెల్లించలేక నిర్వాసితులు భారంగా జీవనం సాగిస్తున్నారు. జాగలెప్పుడు ఇస్తారా అని ఎదురుచూస్తున్నారు.

ఖాళీ చేసి రెండు నెలలు..
భద్రాచలం రామాలయం అభివృద్ధిలో భాగంగా తొలుత మాడ వీధులను విస్తరించాలని ప్రభుత్వం భావించింది. ఇందుకోసం రూ.60.20 కోట్ల నిధులు కేటాయించగా ఆలయానికి రెండు వైపులా ఉన్న ఇళ్ల యజమానులకు నష్ట పరిహారం అందజేశారు. దీంతో ఆయా ఇళ్లలో వారు నిర్వహిస్తున్న బొమ్మల దుకాణాలు, టిఫిన్ సెంటర్లు, ఇతర చిరు వ్యాపారాలను వదులుకుని రెండు నెలల క్రితం ఖాళీ చేసి వెళ్లిపోయారు. ఇంటికి సంబంధించిన నష్ట పరిహారం అందించగా.. ఇంటి స్థలంతో పాటు నిర్మాణానికి అవసరమైన ఆర్‌అండ్ఆర్ ప్యాకేజీ కూడా అందిస్తామని రెవెన్యూ అధికారులు హామీ ఇచ్చారు. అయితే ఇప్పటివరకు జాగా కానీ, ప్యాకేజీ కానీ అందలేదు.

ఇప్పట్లో కానట్టేనా..?
స్థానిక బ్రిడ్జి రోడ్డులో ఉన్న ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్, డివిజన్ కార్యాలయాలను తొలగించి ఆ స్థలాన్ని నిర్వాసితులకు అందించాలని అధికారులు నిర్ణయించారు. నెల క్రితమే స్థలం చదును చేసే పనులు ప్రారంభించారు. మట్టి దిబ్బలు ఉండగా వారం రోజుల్లో పనులు పూర్తి చేసి అందించాలని భావించారు. అయితే పనులు ప్రారంభించాక సీన్ రివర్స్ అయింది. ఆ మట్టి దిబ్బల కింద గట్టి రాళ్లు గుట్టలుగా ఉన్నాయి. దీంతో భారీ క్రేన్లు, జేసీబీల సాయంతో ఆ రాళ్ల గుట్టలను తొలగిస్తున్నారు. తవ్వే కొద్దీ బండలు బయట పడుతున్నాయి. దీంతో మరో నెల రోజులకు పైగా ఈ పనులు కొనసాగే పరిస్థితి కనిపిస్తోంది. దీంతో నిర్వాసితులకు మరి కొన్ని రోజులు ఎదురుచూపులు తప్పవని తెలుస్తోంది.

లాటరీలో 90 గజాల కేటాయింపు...?
ఆర్‌అండ్‌బీ స్థలంలో కొద్దిమేర నిర్వాసితులకు ఇవ్వాలని గతంలో నిర్ణయించిన అధికారులు.. ఆ తర్వాత మరి కొంత పెంచి ఇవ్వాలని భావించారు. ఇందుకు సుమారు మూడెకరాలు అవసరమని తేల్చారు. దీన్ని 40 మంది నిర్వాసితులకు అందజేస్తే ఒక్కొక్కరికి 90 గజాల స్థలం వచ్చే అవకాశం ఉంది. ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఈ స్థలం చాలా విలువైనదిగా భావిస్తున్న నిర్వాసితులు సైతం ఈ స్థలం వైపే మొగ్గు చూపారు. కాగా, స్థలాన్ని పూర్తిగా చదును చేశాక ఇందులోనే రోడ్లు, డ్రెయినేజీలకు కొంత కేటాయించి మిగితా భూమిని లాటరీ ద్వారా అందజేయనున్నారని తెలిసింది. ఆ తర్వాత యూనిట్ల వారీగా ఇంటి నిర్మాణానికి ఆర్ అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వనున్నారు.


త్వరలోనే స్థలం అప్పగిస్తాం



రామాలయ అభివృద్ధికి ఇంటి స్థలాలు ఇచ్చిన నిర్వాసితులకు త్వరలోనే ఆర్‌అండ్‌బీ స్థలం అప్పగిస్తాం. ఇప్పటికే ఈ పనులు పూర్తి కావాల్సి ఉన్నప్పటికీ ఆ స్థలంలో రాళ్ల గుట్టలు ఉండగా, వాటి తొలగింపుతో ప్రక్రియ ఆలస్యమవుతోంది. పూర్తిగా చదును చేశాక లాటరీ ద్వారా స్థలం అందించి ఇంటి నిర్మాణానికి ప్యాకేజీ కూడా ఇస్తాం.
– కొల్లు దామోదర్ రావు, భద్రాచలం ఆర్డీఓ

నిండు కుండల్లా చెరువులు

పాల్వంచరూరల్/ఇల్లెందు/ఇల్లెందురూరల్ : నిన్నా, మొన్నటి వరకు నీరు లేక వెలవెలబోయిన చెరువులు ఇప్పుడు కళకళలాడుతున్నాయి. రెండు, మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో చెరువులు, కుంటలు, వాగుల్లోకి భారీగా నీరు చేరుతోంది. దీంతో పలు చెరువులు అలుగు పోస్తుండగా, మరి కొన్ని పూర్తిస్థాయిలో నిండాయి. జిల్లాలో మొత్తం 2,364 చెరువులకు గాను 94 చెరువులు అలుగు పోస్తున్నాయి. 688 చెరువులు వంద శాతం, 675 చెరువుల్లోకి 75 శాతం, 645 చెరువుల్లో 50 శాతం మేర నీరు చేరడం విశేషం. పాల్వంచ మండలంలోని ఎర్రసాని చెరువు నిండగా, మందేరకలపాడు వద్ద రాళ్లవాగు పికప్ డ్యామ్, ఇల్లెందు మండలం తొడిదెలగూడెం చెరువు సైతం నిండి అలుగు పోస్తున్నాయి. మిట్టపల్లి వద్ద మసివాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. అలాగే, పాల్వంచ మండలం జగన్నాథపురం, రంగాపురం, నాగారం, దంతలబోరు చెరువులు కళకళాడుతున్నాయి. కిన్నెరసాని వాగులో సోములగూడెం, సూరారం, నాగారం వద్ద నిర్మించిన చెక్ డ్యామ్‌లు పొంగిపొర్లుతున్నాయి. వర్షం ఇలాగే కొనసాగితే అన్ని చెరువులు నిండి అలుగు పోసే అవకాశముందని జలవనరుల శాఖ ఈఈ అర్జున్ తెలిపారు. కాగా, ఇప్పటికే వరినార్లు సిద్ధం చేసుకున్న రైతులు ఎడతెరిపి లేని వర్షంతో నాట్లు వేయించడంలో నిమగ్నమయ్యారు. వర్షం తెరపి ఇచ్చినప్పుడు పత్తి, మొక్కజొన్న చేలలో కలుపు నివారణ మందు పిచికారీ చేస్తున్నారు.



ఇల్లెందు : మత్తడి పడుతున్న తొడిదెలగూడెం చెరువు



ఇల్లెందురూరల్ : మిట్టపల్లి వద్ద మసివాగు ప్రవాహం ఇలా..

క్లుప్తంగా

యువత క్రీడల్లో రాణించాలి

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



ఎమ్మెల్యే కూనంనేనితో రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు

కొత్తగూడెంటౌన్: యువత క్రీడల వైపు మొగ్గు చూపడం అభినందనీయమని, భవిష్యత్‌లో మరింతగా రాణించాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఈ నెల 25,26,27 తేదీల్లో హైదరాబాద్‌లోని షేక్‌పేట గ్రౌండ్‌లో రాష్ట్రస్థాయి అండర్–14 బాక్సింగ్ స్టేట్ మీట్ నిర్వహించనున్నారు. జిల్లా నుంచి ఈ పోటీలకు వెళ్లే క్రీడాకారులు, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి ఎం.పరంధామరెడ్డి గురువారం కొత్తగూడెంలో ఎమ్మెల్యేను కలిశారు. ఎమ్మెల్యే వారికి టీ షర్ట్‌లను పంపిణీ చేసి మాట్లాడారు. జిల్లా యువజన క్రీడలశాఖ అధికారి ఎం.పరంధామరెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, వాసిరెడ్డి మురళి, తోటరాజు, బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ మట్టపర్తి రమేష్, కోచ్ ఆర్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కిసాన్ మోర్చా నిరసన



కలెక్టరేట్ ఏఓకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

చుంచుపల్లి: కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు. కలెక్టర్ ఆఫీస్ సాధారణ పరిపాలన అధికారి రామకృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా రైతులకు ఒరిగిందేమీ లేదన్నారు. సీతారామ కాలువకు ఇరువైపులా ఉన్న రైతులకు సాగునీళ్లు అందడం లేదని ఆరోపించారు. ప్రజలకు కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలు ఇచ్చిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు చిలుకూరి రమేష్, ఏనుగు వెంకటరెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షుడు కేవీ రంగా కిరణ్, జంపన సీతారామరాజు, రంజిత్,రాపాక రమేష్, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

విచారణ చేపట్టాలి

ఇల్లెందురూరల్: మండలంలోని బొజ్జాయిగూడెం గ్రామపంచాయతీ వేపలగడ్డతండా గ్రామంలో ధరావత్ రమేష్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడని, ఈ ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలని మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కోరారు. గురువారం ఇల్లెందు సీఐ సురేష్‌ను కలిసి సమస్య విన్నవించారు. రమేష్ ఆత్మహత్య చేసుకున్నట్లుగా పోలీసులు పేర్కొంటున్నారని, కానీ ఘటనా స్థలంలో కనిపించిన దృశ్యాలు తమకు అనుమానం కలిగిస్తున్నాయని వివరించారు. స్పందించిన సీఐ సమగ్ర విచారణ చేపడుతామని హామీ ఇచ్చారు.

నవోదయలో ముగిసిన క్రీడాపోటీలు



మార్చ్‌ఫాస్ట్ విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసులు

కూసుమంచి: మండలంలోని పాలేరులో జవహర్ నవోదయ విద్యాలయలో నిర్వహిస్తున్న క్లస్టర్ స్థాయి స్పోర్ట్స్ మీట్ గురువారంతో ముగిసింది. ఇక్కడ ప్రతిభ చాటిన విద్యార్థులను త్వరలో జరగనున్న రీజినల్ పోటీలకు ఎంపిక చేశారు. క్లస్టర్ మీట్‌లో పాలేరు నవోదయ విద్యార్థులతో పాటు వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, నల్లగొండ, మెదక్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల నవోదయ విద్యాలయాల నుంచి 345 మంది విద్యార్థులు పాల్గొనగా వీరిలో 234 మంది రీజినల్ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్ 14, 17, 19 విభాగాల్లో బాలబాలికలకు బ్యాడ్మింటన్, కబడ్డీ, టేబుల్ టెన్నిస్, చెస్, ఖో–ఖో, యోగా పోటీలు నిర్వహించగా పాలేరు, నల్లగొండ విద్యార్థులు మార్చ్‌ఫాస్ట్‌తో పాటు వివిధ క్రీడల్లో సత్తా చాటారు. కాగా, రీజినల్ స్థాయి పోటీల్లో భాగంగా కరీంనగర్‌లో ఖో–ఖో, కాకినాడలో కబడ్డీ, కేరళలో బ్యాడ్మింటన్, కర్ణాటకలో చెస్, తూర్పుగోదావరిలో టేబుల్ టెన్నిస్, గుంటూరులో యోగా పోటీలు జరుగుతాయని పాలేరు ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసులు తెలిపారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్య

తిరుమలాయపాలెం: మండలంలోని బచ్చోడుకు చెందిన మేడ శ్రీను(59) గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆయనకు ఇద్దరు భార్యలు ఉండగా, కొద్దిరోజులుగా గొడవలు జరుగుతుండడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఈమేరకు బుధవారం రాత్రి ఇంట్లో గడ్డి మందు తాగిన శ్రీనును ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఆయన కుమారుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

శ్రావణం.. ఆధ్యాత్మికం



ఖమ్మం గుంటు మల్లేశ్వరస్వామి ఆలయంలో వరలక్ష్మీ వ్రతం ఆచరిస్తున్న మహిళలు (ఫైల్)

నేటి నుంచి శ్రావణమాసం

- నెలంతా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, వ్రతాలు
- రేపటి నుంచి వివాహ ముహూర్తాలు

కొత్తగూడెం టౌన్/జూలూరుపాడు: సకల శుభాలకు నిలయంగా భావించే శ్రావణ మాసం వచ్చేసింది. హిందువులకు శుభప్రదమైన శ్రావణ మాసం శుక్రవారం నుంచి మొదలుకానుంది. ఈ నెలంతా పండుగలు, ఆలయాల్లో ప్రత్యేక పూజలు, వ్రతాలకు తోడు వివాహ ముహూర్తాలు ఉండడంతో ఆధ్యాత్మికత వెల్లివిరియనుంది. మహిళలు ప్రత్యేకంగా జరుపుకునే వరలక్ష్మీ వ్రతం, బోనాల వేడుకలే కాక రాఖీ పౌర్ణమి, నాగుల పంచమి ఈనెలలో రానున్నాయి.

బోనాల పండుగ ప్రత్యేకం

ఆషాఢ మాసంలో పలుచోట్ల అమ్మవార్లకు బోనాలు చెల్లిస్తుండగా, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో శ్రావణ మాసంలో బోనాల పండుగ జరుపుకుంటారు. గ్రామీణ ప్రాంతాల్లో వరినాట్లు ముగించుకుని అమ్మవార్లకు బోనాలు చెల్లించడం ఆనవాయితీగా వస్తోంది.

వివాహాల సందడి

శ్రావణమాసంలో శుభ ముహూర్తాలు ఉండడంతో పలువురు తమ పిల్లలకు వివాహాలు జరిపించేందుకు సిద్ధమవుతున్నారు. ఈనెల 26 నుంచి వివాహాలు, నిశ్చితార్థాలు, గృహాల శంకుస్థాపన, గృహ ప్రవేశాలు మంచి రోజులు ఉన్నాయని పండితులు చెబుతున్నారు. ఈ నెల 26, 27, 30, 31వ తేదీలతోపాటు ఆగస్టు 1, 3, 4, 6, 7, 8, 9, 10, 11, 13, 14, 17, 18వ తేదీల్లో ముహూర్తాలు ఉండగా.. పెద్ద సంఖ్యలో వివాహాలు జరగనున్నాయి. దీంతో ఇప్పటికే పలువురు ముహూర్తాలు కుదుర్చుకున్నారు. ఈ కారణంగా మండపాలు, పురోహితులు, ఫొటోగ్రాఫర్లు, వంట మనుషులకు డిమాండ్ పెరగనుంది. శ్రావణ మాసం తర్వాత వచ్చే భాద్రపద మాసం సెప్టెంబర్ 21 వరకు కొనసాగుతుండగా శూన్య మాసం కావటంతో ముహూర్తాలు ఉండవు. ఆ తర్వాత సెప్టెంబర్ 23 నుంచి ముహూర్తాలు ప్రారంభమై 24, 26, 27, 28, అక్టోబర్ 1, 2, 3, 4, 8, 10, 11, 12, 22, 24, 29, 30, 31వ తేదీలతో పాటు నవంబర్ 1, 2, 7, 8, 12, 13, 15, 22, 23, 26, 27,29, 30వ తేదీల్లో శుభ ముహూర్తాలు ఉన్నాయి. అనంతరం డిసెంబర్ 8 నుంచి ఫిబ్రవరి 6వరకు రెండు నెలల పాటు ముహూర్తాలు లేవని పండితులు చెబుతున్నారు.

పండుగల మాసం

శ్రావణ మాసం అంతా పండుగల సందడి ఉంటుంది. ఈసారి శ్రావణంలో ఐదు శుక్రవారాలు వస్తుండగా, 29వ తేదీన మంగళ గౌరి వ్రతాన్ని ప్రారంభిస్తారు. ఇదేరోజు నాగపంచమి కావడంతో నాగదేవతకు పూజలు చేయనున్నారు. అలాగే, ఆగస్టు 1న రెండో శుక్రవారం, 8న మూడో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం, 9న రాఖీ పండుగ, అదే రోజు జంధ్యాల పౌర్ణమి, 16న శ్రీ కృష్ణ జన్మాష్టమి, 23న రైతులు పొలాల అమావాస్య జరుపుకోనున్నారు.

శ్రావణ మాసం విశిష్టమైనది



శ్రావణ మాసం అన్ని విధాల విశిష్టమైనది. వ్యాపార, గృహ ప్రవేశాలు, నూతన వ్యాపారాలు, పెళ్లిళ్లకు మంచి ముహూర్తాలు ఉన్నాయి. ఈ నెలలో దేవతా సంబంధిత వ్రతాలు ఆచరిస్తే శుభాలు కలుగుతాయి. హిందూ, వైదిక సంప్రదాయాలు, ఆచారాలు పాటిస్తే ఆరోగ్యకరమైన జీవితం గడపొచ్చు.

– పురాణం కామేశ్వరశాస్త్రి, శ్రీ అభయాంజనేయస్వామి ఆలయం, అనంతారం

పూజలు, వ్రతాలతో పుణ్యఫలం



ఈనెల శుభఘడియలే కాక పండుగలకు నిలయంగా నిలుస్తుంది. మంచి ముహూర్తాలు అనేకం ఉన్నాయి. ఈనెలలో మహిళలకు ఇష్టమైన వరలక్ష్మీదేవి వ్రతం జరుపుకోనున్నారు. అంతేకాక పెళ్లిళ్లు, గృహ ప్రవేశాలు వంటి శుభకార్యాలను జరుపుకునేందుకు అనువుగా ముహూర్తాలు ఉన్నాయి.

– నల్లాన్ చక్రవర్తుల క్రాంతికుమారాచార్యులు, అర్చకులు, విద్యానగర్ కాలనీ

యూరియా కోసం రైతుల నిరీక్షణ



నిరసన తెలుపుతున్న రైతులు

కరకగూడెం: కరకగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సేల్ పాయింట్‌లో యూరియా నిల్వలు ఉన్నా గురువారం పంపిణీ చేయలేదు. దీంతో రైతులు ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరీక్షించారు. ఖమ్మం మార్క్‌ఫెడ్ అధికారులు పీఓఎస్ (పాయింట్ ఆఫ్ సేల్) యంత్రంలో నమోదు చేసే డీసీ (డెలివరీ చలాన్) నంబర్‌ను కరకగూడేనికి బదులు పినపాకకు ఇచ్చినట్లు తెలిసింది. దీంతో డీసీ నంబర్ రాలేదని సిబ్బంది యూరియా ఇవ్వకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అధికారుల తీరుపై నిరసన తెలిపి, నిరాశగా వెనుదిరిగారు. కాగా యూరియా కోసం వచ్చిన వారిలో వృద్ధులు, బాలింతలు కూడా ఉన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపిక



తడిసిన మైదానంలోనే పరుగెత్తుతున్న క్రీడాకారులు



విజేతలకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న డీవైఎస్‌ఓ పరంధామరెడ్డి

పాల్వంచరూరల్: కిన్నెరసాని స్పోర్ట్స్ పాఠశాలలో గురువారం జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి 600 మంది క్రీడాకారులు హాజరుకాగా, డీవైఎస్‌ఓ పరంధామరెడ్డి పోటీలను ప్రారంభించారు. క్రీడల్లో ప్రతిభ చూపిన 40 మందిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఆగస్టు 3న హన్మకొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొననున్నారు. డీవైఎస్‌ఓ విజేతలకు ప్రశంసా పత్రాలను అందజేసి మాట్లాడారు. రాష్ట్రస్థాయిలో కూడా ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జి.యుంగధర్‌రెడ్డి, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.మహీధర్, అధ్యక్షుడు గొట్టపు రాధాకృష్ణ, ఎస్‌ఐ సురేష్, పూనెం కృష్ణదొర, పి.నాగేందర్, రామారావు, వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

తడిసిన మైదానంలోనే..

వర్షం కురుస్తుండటంతో క్రీడా మైదానం తడిసిపోయి జారి కిందపడే ప్రమాదకర పరిస్థితి నెలకొంది. వర్షపు నీరు నిలిచింది. అయినా అథ్లెటిక్స్ నిర్వాహకులు పట్టించుకోకుండా పోటీలు కొనసాగించారు. దీంతో ఇద్దరు క్రీడాకారులు పరిగెత్తుతూ జారి కిందపడగా, స్వల్ప గాయాలయ్యాయి.

ఊపందుకుంటున్న 'సాగు'

- లోటు వర్షపాతం నుంచి గట్టెక్కిన జిల్లా
- 16 మండలాల్లో సాధారణం, ఏడు మండలాల్లో అధికం



వరిలో పురుగుమందు పిచికారీ చేస్తున్న రైతు

సూపర్‌బజార్(కొత్తగూడెం): లోటు వర్షపాతం నుంచి జిల్లా గట్టెక్కింది. రెండు రోజుల క్రితం వరకు అంతగా వర్షాలు లేక వ్యవసాయ పనులు మందకొడిగా సాగగా.. ప్రస్తుతం ఊపందుకున్నాయి. దీంతో రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుత వర్షాలతో పత్తి మొక్కలు జీవం పోసుకుంటుండగా వరినాట్లు ముమ్మరమయ్యాయి. గురువారం నాటికి జిల్లాలోని 16 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదు కాగా, మరో ఏడు మండలాల్లో అధిక వర్షం కురిసింది.

వర్షపాతం వివరాలిలా..

జిల్లాలో జూన్ 1 నుంచి ఇప్పటివరకు 446.2 మి.మీ. వర్షం కురవాల్సి ఉండగా 413.1 మి.మీ వర్షపాతం నమోదైంది. చర్ల, మణుగూరు, టేకులపల్లి, జూలూరుపాడు, చంద్రుగొండ, పాల్వంచ, అశ్వారావుపేట మండలాల్లో అధిక వర్షం కురవగా, కరకగూడెం, పినపాక, దుమ్ముగూడెం, అశ్వాపురం, ఆళ్లపల్లి, గుండాల, ఇల్లెందు, అన్నపురెడ్డిపల్లి, చుంచుపల్లి, సుజాతనగర్, కొత్తగూడెం, లక్ష్మీదేవిపల్లి, బూర్గంపాడు, భద్రాచలం, ములకలపల్లి, దమ్మపేట మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో వివిధ పంటల సాధారణ విస్తీర్ణం 4,50,512 ఎకరాలుగా వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ఇందులో ఇంకా 1,38,725 ఎకరాల్లో పంటలు వేయాల్సి ఉంది.

ప్రమాద బీమాతో కార్మిక కుటుంబాలకు భరోసా

- రూపాయి ప్రీమియం లేకుండా రూ.1.20 కోట్ల పరిహారం
- సహజ మరణం పొందితే రూ.ఆరు లక్షల చెల్లింపు



కార్మిక కుటుంబానికి ప్రమాద బీమా అందిస్తున్న ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క(ఫైల్)

సింగరేణి(కొత్తగూడెం): కార్మిక, ఉద్యోగ కుటుంబాల సంక్షేమానికి సింగరేణి సంస్థ అనేక చర్యలు చేపడుతోంది. రూపాయి ప్రీమియం చెల్లించకుండా రూ. 1.20 కోట్ల బీమా పరిహారం దక్కేలా చూస్తోంది. సింగరేణి కార్మికుడికి జాతీయ బ్యాంక్‌లైన ఎస్‌బీఐ, యూబీఐ, కెనరా బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ బరోడాలో కేవలం శాలరీ అకౌంట్ ఉంటే ఈ బీమా వర్తిస్తుంది. కార్మికుడికి 13 రకాల సదుపాయాలతోపాటు ప్రమాదంలో మృతి చెందితే పరిహారం అందుతుందని సింగరేణి ఉన్నతాధికారులు చెబుతున్నారు. సహజ మరణం పొందిన వారికీ రూ. ఆరు లక్షల పరిహారం అందుతుంది. సంస్థవ్యాప్తంగా వివిధ ప్రమాదాల్లో ఆరుగురు కార్మికులు మృతి చెందగా, వారి కుటుంబాలకు పరిహారం అందజేశారు. ఇటీవల మణుగూరు ఓసీలో జరిగిన ప్రమాదంలో మృతిచెందిన కార్మికుడు మూల్‌చంద్ విశ్వకర్మ, ఆర్జీ–1, ఏరియాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సపోర్ట్‌మెన్ రంజిత్‌కుమార్ కుటుంబాలకు గత నెల 28న ప్రజాభవన్‌లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పరిహారాన్ని అందజేశారు.

కుటుంబాలకు ఆర్థిక భరోసా..



సంస్థలో అమలవుతున్న రూ.1.20 కోట్ల ప్రమాద బీమా పథకం దేశంలోనే ఆదర్శంగా నిలిచింది. ప్రమాదంలో కార్మికుడు మృతిచెందితే అతని కుటుంబం వీధిన పడకుండా ఆర్థిక భరోసా కల్పించేందుకు కృషి చేస్తున్నాం.

–ఎన్.బలరామ్, సింగరేణి సీఎండీ

జాతీయ బ్యాంకులకు మారాలి



సింగరేణి కార్మికులు 70 శాతం మంది ఇప్పటికే ఎస్‌బీఐ, యూబీఐ, కెనరా బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ బరోడాలలో ఖాతాలు కలిగి ఉన్నారు. మిగతా వారు కూడా ఆయా బ్యాంక్‌ల్లో ఖాతాలు తెరవాలి.

–జీవీ కిరణ్‌కుమార్, జీఎం పర్సనల్ (వెల్ఫేర్)

డబ్బుకంటే విలువైంది మనిషి ప్రాణం



సింగరేణి సహకారం బాగుంది. కానీ మనిషిలేని డబ్బు ఎందుకు? యాజమాన్యం రక్షణ చర్యలపై మరికొంత చొరవ చూపాల్సి ఉంది. యంత్రాల నిర్వహణపై దృష్టి సారిస్తే ఇలాంటి ప్రమాదాలు జరగవు. సంస్థపై కూడా భారం పడదు.

–హరిదేవి, మృతి చెందిన కార్మికుడు మూల్‌చంద్ భార్య

గంజాయి సీజ్



వివరాలు వెల్లడిస్తున్న అధికారులు

భద్రాచలంటౌన్: భద్రాచలం మీదుగా ఒడిశా నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న గంజాయిని ఎస్‌టీఎఫ్ బృందం గురువారం పట్టుకుంది. పట్టణంలో రూట్‌వాచ్‌తోపాటు వాహన తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని ఆపి తనిఖీ చేయగా బ్యాగులో 8.6 కిలోల గంజాయి లభించింది. ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించగా ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరిని చెందిన శంకర్‌దాస్, మాటేరులు హైదరాబాద్ నగరం బోరుబండకు చెందిన అంజన్ దూబేకు గంజాయి ఇచ్చేందుకు వెళ్తున్నట్లు తేలింది. దీంతో ఇద్దరిని అరెస్ట్ చేసి భద్రాచలం పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. గంజాయితోపాటు బైక్, రెండు సెల్‌ఫోన్లను సీజ్ చేశారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.4 లక్షలు ఉంటుందని ఎస్‌టీఎఫ్ అధికారులు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తుల దాడి

వలస ఆదివాసీ గిరిజనుడి మృతి



గిరిజనుడి మృతదేహం

చర్ల: మండలంలోని క్రాంతిపురంలో గుర్తు తెలియని వ్యక్తులు చేసిన దాడిలో తీవ్రంగా గాయపడిన గిరిజనుడు భద్రాచలం వైద్యశాలకు తరలిస్తున్న క్రమంలో మృతి చెందాడు. అతని భార్యను కూడా హతమార్చేందుకు యత్నించగా ఆమె తప్పించుకుని ప్రాణాలతో బయటపడింది. మండలంలోని కొయ్యూరు గ్రామ పంచాయతీ వలస ఆదివాసీ గ్రామం క్రాంతిపురానికి చెందిన మడకం భద్రయ్య (40) ఇంటికి బుధవారం రాత్రి ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చారు. కత్తులు, గొడ్డళ్లతో దాడి చేయడంతో తీవ్ర గాయాలై భద్రయ్య కుప్పకూలిపోయాడు. అతని భార్య లక్ష్మి కేకలు వేయగా, ఆమెను కూడా హతమార్చేందుకు యత్నించారు. దీంతో తప్పించుకుని ప్రాణాలతో బయటపడింది. గ్రామస్తులు క్షతగాత్రుడిని కొయ్యూరు ప్రభుత్వ వైద్యశాలకు, అక్కడి నుంచి భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు సీఐ రాజువర్మ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గ్రామంలో డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీంతో తనిఖీలు నిర్వహించారు. కాగా క్రాంతిపురంలో గడిచిన ఐదేళ్ల కాలంలో మూడు హత్యలు జరిగాయి. పోలీసులు దృష్టి సారించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అడవిపంది మాంసం స్వాధీనం

ఆరుగురిపై కేసు నమోదు



అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్న అడవిపంది మాంసం

ములకలపల్లి: అటవీశాఖ అధికారులు గురువారం అడవి పంది మాంసం స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. మాధారం ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ (ఎఫ్ఎస్ఓ) హరిప్రశాంత్ కథనం ప్రకారం... పాల్వంచ రేంజ్ పరిధిలోని ములకలపల్లి మండలం కొమ్ముగూడెం గ్రామ శివారులో ఉన్న మామిడితోటలో అడవిపందిని వేటాడినట్లు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో అటవీశాఖ సిబ్బంది దాడులు నిర్వహించారు. వేటగాళ్లు అమర్చిన ఉచ్చులో పడి మృతిచెందిన అడవిపంది మాంసాన్ని, ఉచ్చులు తయారుచేసేందుకు వినియోగించే వైర్లను స్వాధీనం చేసుకున్నారు. నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని, మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు ఎఫ్ఎస్ఓ తెలిపారు. నిందితులను పాల్వంచ రేంజ్ కార్యాలయానికి తరలించినట్లు పేర్కొన్నారు.

కారు, వ్యాన్ ఢీ : డ్రైవర్‌కు గాయాలు

పాల్వంచరూరల్: కారు, డీసీఎం వ్యాన్ ఢీకొని డ్రైవర్‌కు గాయాలైన ఘటన గురువారం రంగాపురం వద్ద జరిగింది. భద్రాచలానికి చెందిన నర్సింహారావు కారులో పాల్వంచ వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో రంగాపురం వద్ద జాతీయ రహదారిపై డీసీఎం వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో కారు నడుపుతున్న నర్సింహారావుకు తీవ్రగాయాలయ్యాయి. రెండు వాహనాల ముందు భాగాలు ధ్వంసమయ్యాయి.

దమ్ము ట్రాక్టర్ బోల్తా : ఒకరికి గాయాలు

బూర్గంపాడు: దమ్ము చేస్తుండగా ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ తీవ్రంగా గాయపడిన ఘటన గురువారం కృష్ణసాగర్ గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... అశ్వాపురం మండలం మొండికుంట గ్రామంలో ఉంటున్న వలస ఆదివాసీ చుక్కయ్య గురువారం కృష్ణసాగర్ గ్రామంలోని తమ బంధువుల మాగాణి దమ్ము చేసేందుకు వచ్చాడు. దమ్ము చేస్తున్న క్రమంలో ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో చుక్కయ్యకు తీవ్రగాయాలు కాగా, చికిత్స నిమిత్తం భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

పాల్వంచరూరల్ : పురుగుల మందుతాగి ఓ యువకుడు గురువారం ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని రేగులగూడెం గ్రామానికి చెందిన ముక్కటి రంగయ్య, ముసలమ్మ చిన్నకుమారుడు రవి పీజీ చదివాడు. ఉద్యోగంలేక వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొద్దిరోజులుగా మానసిక స్థితి బాగాలేక ఇబ్బందులు పడుతున్నాడు. గురువారం పురుగుల మందు తాగగా, తల్లిదండ్రులు కొత్తగూడెంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. దీంతో చికిత్స పొందుతున్నాడు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

సుజాతనగర్: పోలీసులు గురువారం సుజాతనగర్‌లో పేకాట స్థావరంపై దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేశారు. రూ.3 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఎం.రమాదేవి తెలిపారు.

పోక్సో కేసులో వృద్ధుడికి 20 ఏళ్ల జైలుశిక్ష

ఖమ్మంలీగల్/కూసుమంచి: నాలుగేళ్ల బాలికకు మాయమాటలు చెప్పి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడిన నిందితుడికి ఇరవై ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.2లక్షల జరిమానా విధిస్తూ ఖమ్మం జిల్లా పోక్సో–2 కోర్టు ఇన్‌చార్జ్ న్యాయాధికారి కె.ఉమాదేవి గురువారం తీర్పు వెలువరించారు. కూసుమంచి మండలం ధర్మాతండాకు చెందిన యాభై ఏళ్ల వృద్ధుడు బానోత్ రాములు 2023 ఆగస్టు 15న అదే తండాకు చెందిన నాలుగేళ్ల బాలిక ఆమె ఇంటి వద్ద ఆడుకుంటుండగా మామిడికాయలు ఇస్తానంటూ మాయమాటలు చెప్పి తన ఇంటికి తీసుకెళ్లాడు. ఈ క్రమాన చిన్నారిపై లైంగిక దాడి చేయగా, బాధితురాలి తల్లి ఫిర్యాదుతో కూసుమంచి పోలీసులు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం కోర్టులో చార్జీషీట్ దాఖలు చేయగా విచారణ అనంతరం రాములుపై నేరం రుజువైనందున జైలుశిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ తరఫున అదనపు ప్రాసిక్యూటర్ మహ్మద్ ఇర్షాద్ వాదించారు. కాగా, నిందితుడికి కేసు పడేలా పకడ్బందీగా చార్జీషీట్ దాఖలు చేసిన నాటి, ప్రస్తుత ఏసీపీలు బస్వారెడ్డి, తిరుపతిరెడ్డితో పాటు నాటి ఎస్సై రమేష్, ఉద్యోగులను సీపీ సునీల్‌దత్ అభినందించారు.

ముద్దాయికి జీవితఖైదు

భార్యను హతమార్చిన కేసులో కోర్టు తీర్పు

కొత్తగూడెంటౌన్: భార్యను హత్య చేసిన వ్యక్తికి జీవితఖైదు విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ గురువారం తీర్పు చెప్పారు. తీర్పు వివరాలు ఇలా.. దమ్మపేట మండలం గండుగులపల్లికి చెందిన వట్టి వెంకటలక్ష్మికి అలియాస్ సుధాను మంగపేట మండలం తిమ్మంపేటకు చెందిన బత్తుల శ్రీనివాస్‌తో 16 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి కుమారుడు కాగా, మణుగూరు సుందరయ్యనగర్‌లో నివాసం ఉంటున్నారు. తాగుడుకు బానిసైన శ్రీనివాస్ మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. తన అక్క కె.సావిత్రితో కలిసి భార్యను వేధిస్తున్నాడు. ఈ క్రమంలో 2020, సెప్టెంబర్ 10న రాత్రి గొడవ పెట్టుకుని కత్తితో దాడి చేసి భార్యను హతమార్చాడు. మృతురాలి తండ్రి నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. 13 మంది సాక్షులను విచారించిన న్యాయమూర్తి నిందితుడు బత్తుల శ్రీనివాస్‌కు జీవితఖైదుతోపాటు రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. సావిత్రి నిర్దోషిగా తేలడంతో విడుదల చేయాలని ఆదేశించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ పీవీడీ లక్ష్మి వాదనలు వినిపించగా, సిబ్బంది జి. ప్రవీణ్‌కుమార్, ఎన్.వీరబాబు, అశోక్ సహకరించారు.

రేపు జాబ్‌మేళా

సింగరేణి(కొత్తగూడెం): భారత్ హుందాయ్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఖాళీగా ఉన్న 17 పోస్టుల భర్తీకి ఈ నెల 26న కొత్తగూడెంలోని ఎంపీడీవో కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి కొండపల్లి శ్రీరామ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.